# కథ

## అతడు, ఆమె, నేను

**అతడు:** ఎం.ఎ. గోల్డు మెడలిస్టు. కాలేజీ చదివే రోజుల్లో గాయత్రి చేయనిదే కాఫీ ముట్టడని, చాలా సాత్వికుడని పేరట. ఉద్యోగం దొరకలేదు. ఉద్యోగం లేక పోయినా, పూర్వీకులిచ్చిన ఆస్తి వుంది కాబట్టి, అవసరాలకి లోటులేదు.

**ఆమె:** అందాలరాశి. కోల ముఖం, సన్నని ముక్కు, మంచి నీళ్ళు తాగుతుంటే గొంతులో నీళ్ళు కన్పడేంత స్వచ్ఛమైన తెల్లదనం, మోకాళ్ళదాటే జడ, వెడల్పాటి కళ్ళు, నవ్వితే రత్నాల్లా మెరిసే పలువరుస... ఇలా జానపదాల్లోని నాయికలా వర్ణించుకుంటూ పోవచ్చు.

**నేను:** స్వతహాగా పిరికి వాడ్ని. నాకేం కావాలో నాకే తెలియదు. తెలిసినా, పైకి చెప్పే ధైర్యం లేదు. ఏదైనా పోగొట్టుకున్న తరువాత గానీ, దాని విలువ తెలియదు నాకు. అందుచేతనే జీవితంలో చాలా పోగొట్టుకున్నా.

**అతడు, ఆమె:** శేఖర్‌కి కుముదిని చక్కని జంట. ఒకరి కోసం ఒకరన్నట్లుగా వుండేవారు. ఒక కొడుకు, ఒక కూతురు. ఐతే, నిరుద్యోగం వాళ్ళ పాలిట శాపం అయింది. అతనికి గాయత్రి ఫలితం కన్పడలేదు. దేముడు లేడన్నాడు. మనుషులే దేముడనే పదార్థాన్ని సృష్టించి, మనిషి,

మనిషికిఅంతరాలని పెంచి, కులాలని పోషించి, సాటి మనిషిని దోచుకుంటున్నాడని నమ్మడం మొదలెట్టాడు. ఫలితం, కరుడు కట్టిన తీవ్రవాది అయ్యాడు. ఇల్లు, వాకిలి మరచిపోయాడు.

అడవులు, కొండలు పట్టుకుని తిరగడం మొదలెట్టాడు. భార్యా, బిడ్డ అని పట్టించుకోడం మానేశాడు. ఆమె ఒక సగటు ఆడది. అతను వదలిన 'గాయత్రిని' ఆమె 'లలితా దేవి' రూపంలో ప్రార్థిస్తోంది. ఉన్న ఆస్తిలోనే పిల్లలని పోషిస్తూ గుట్టుగా కాపురం చేసుకుంటోంది.

**అతడు, నేను:** పెళ్ళిలోనే పరిచయం. యోగ్యుడను కున్నా.



— టి.ఎస్. హరగోపాల్

**ఆమె, నేను:** నాకంటే ఆర్నెల్లే చిన్నది. కాని, నాకంటే పెద్దదనిపించేది. మా మేనమామ కూతురైనా, మరదలని ధైర్యం చేయలేక పోయేవాడ్ని. నాలో ఆమె అంటే ప్రేమ, అభిమానం నాలోనే వుండిపోయేవి. 'పిరికి' అని ఎవరూ లేనప్పుడు నన్ను ఆట పట్టిస్తూ వుండేది. ఆ రోజుల్లో అర్థం అవలా, ఆమె అలా ఎందుకనేదో. శేఖర్‌తో పెళ్ళి అయిన నాడు నా గుండెలంతా పిండేసినట్లనిపించింది. ఏదో పోగొట్టుకున్నానని పించింది. ఆమె కూడా నా వైపు జాలిగా చూసింది. అక్కడుండలేక పోయా. దూరంగా... ఆ పెళ్ళి వాయిద్యాలు విన్పడనంత దూరంగా వెళ్ళి పోయి, తనివి తీరా ఏడ్చా. అప్పుడు గుర్తించా, ఆమెపై నాలో వున్న ఆరాధనా భావాన్ని. ఎక్కడో ఒక చోట కట్టుకున్న వాడితో సుఖంగా వుండాలని దీవించా.

**అతడు, ఆమె, నేను:** మేము ఒక్కరుగా, ఇద్దరుగా వున్నప్పుడు జీవితాలు సాఫీగానే నడిచాయి.

10-1-92 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

ముగ్గురం అయినప్పుడే మా జీవితాల్లోని అపశృతుల శబ్దాలు వినబడ్డాయి.

విధి వైచిత్ర్యం... నాకు నిజామాబాదుకి ట్రాన్స్‌ఫర్ అయింది.

నన్ను చూసి, ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది. ఆనందం పట్టలేకపోయింది. ఆ రోజు రాత్రి భోజనం,

హడావిడి చేసింది. నాకూ కుముదినిని యింతకాలానికి చూసిన ఆనందం. పిల్లలని నిద్రపుచ్చి రాత్రి చాలా సేపు కబుర్లు చెప్పుకున్నాం. పూర్వం బెరుకు లేదు నాలో. కుముదిని కూడా అంది 'పూర్వపు పిరికి వాడివి కావే'' నని.

వాళ్ళింటికి దగ్గర్లోనే గది తీసుకున్నా. బ్యాంక్ టైం అయిన తరువాత వాళ్ళ యింటికే వెళ్ళేవాడ్ని. పిల్లలు తొందరగా నిద్రపోయేవారు. అప్పుడు చిన్నప్పటి కబుర్లు... స్కూలులో అల్లర్లు... గంటల తరబడి, రాత్రి ప్రొద్దు పోయే వరకు చెప్పుకునే వాళ్ళం. ఎప్పుడో తెల్లవారు జామున గదికి వెళ్ళేవాడ్ని. వాళ్ళ ఆయన రోజుల తరబడి కొండలు, కోనలు పట్టుకు తిరుగుతూ యింటికి రాకపోయినా మా యిద్దరికీ ఏమీ అనిపించేది కాదు.

''పెళ్ళి చేసుకోవూ రవి'' అంది ఒక రోజు.

''నీ అంత అందమైన అమ్మాయి కన్పడితే తప్పకుండా చేసుకుంటా''

''నాఅంత అందమైనఅమ్మాయి కావాలనుకుంటే, నన్నే చేసుకోక పోయావ్'' కిలకిలా నవ్వుతూ అంది.

ఆ రాత్రల్లా ఏడిచా, చేజేతులా పోగొట్టుకున్న అదృష్టాన్ని తలచుకుని.

మరునాడు వాళ్ళింటికి వెళ్ళబుద్ధి కాలేదు. చీకటి పడ్తుండగా తానే వచ్చింది. చేతిలో పాయసం గిన్నెతో. తలారా స్నానం చేసి, వదులు జడలో మల్లెపూలు పెట్టుకుని, ఎర్రంచు ఆకు పచ్చ రంగు పట్టుచీర, తెల్లని జాకెట్టు అపర రతీదేవిలా వుంది.

''ఈ రోజు రాలేదేం రవీ రోజల్లా నీకోసం ఎదురు చూశా, యిదుగో పాయసం'' అంది.

''ఏమిటి విశేషం'' అన్నా తేరుకుని.

''నా బర్త్‌డే, అది కూడా గుర్తు లేదు'' నిష్ఠూరంగా అంది.

నిజమే, ఆగస్టు పదహారు. స్వతంత్ర దినం మరువాడు పుట్టింది. చిన్నప్పుడు ఆ రోజు కూడా స్కూలు మాని, సరదాగా గడిపేవాళ్ళం.

''సారీ మర్చిపోయా, హాపీ బర్త్‌డే''

ఆమె చెంచాతో నా నోట్లో పాయసం వేసింది. చాలు, చాలంటూ ఆమె చెయ్యి పుచ్చుకుని వారించా.

చిరునవ్వు నవ్వింది.

ఆమెని సరిగా చదవలేక పోతున్నా.

ఆమె ఎవరో కాదు. మరదలు... వరసే... తప్పేమిటి... నాకు హక్కు వుంది.

ఛ, యింత నీచంగా ఆలోచించ కూడదు.

''రా, చీకటి పడింది. యింటి దగ్గర దింపివస్తా''నని కాళ్ళకి చెప్పు లేసుకున్నా.

అవకాశం వున్నప్పుడల్లా, ఏదో వంకతో ఆమెని తాకేవాడ్ని. నవ్వుతూ, సుతారంగా తప్పుకునేది.

మా స్వేచ్ఛకి అడ్డు లేదు, కాని, ఓ అడుగు ముందుకు వేయడానికి ధైర్యం చేయలేక పోయేవాడ్ని.

జీవితమంతా మధనమే!

అతనంటే ఆమెకి ప్రేమ...

నేనంటే యింత చనువు.

ఈ ద్వంద్వ ప్రవృత్తి నాకు కొరుకుడు గాని సమస్య.


ఓ రోజు చీకటి పడిన తరువాత, వాళ్ళింటికి వెళ్ళా.

''నా కథ పత్రికలో పడింది'' అంటూ పుస్తకం చూపించింది.

''ఏది'' అంటూ చేయి జాపా.

''అబ్బాశే, మరదలి కథ చదవాలంటే, బావకి చాలా ఖర్చవుతుంద''ని నవ్వుతూ, పుస్తకాన్ని పైకెత్తి పట్టుకుంది.

కథ చదవాలనే ఉత్సాహంలో, నేను ఆమెని పట్టుకుని పైకెత్తిన చేతిలో పుస్తకం తీసుకోబోయా.

ఆమె నా బాహుబంధాల్లో...

అప్పుడే వచ్చాడు శేఖర్.

గుమ్మంలోంచి వస్తున్న అతడిని చూసి "రండి, నా కథకి పత్రికలో ప్రథమ బహుమతి వచ్చింది" అంటూ సంతోషంగా చెప్పిందామె.

నేను అతనిని ఒక్కసారిగా చూసి, స్తబ్దుడ్నయ్యా.

"సర్సరే, తరువాత చదువుతాలే, అన్నం పెట్టు" అంటూ విసురుగా వెళ్ళిపోయాడతను.

నేను యిబ్బంది ఫీలయ్యాను. "తరువాత వస్తాలే కుమూ" అంటూ నా గదికి వెళ్ళి పోయా.

కొద్ది సేపటికి అతడు నా గదికి వచ్చాడు.

నాకాశ్చర్యంవేసింది. అతను ప్రథమంగా నా గదికి రావడం.

"కూర్చోండి" అన్నా.

"ఫర్వాలేదం"టూనే కుర్చీలో కూర్చున్నాడు.

ఏం మాట్లాడాలో తెలియలేదు.

"ఒంటరితనం ఫీలవటం లేదూ" అన్నాడతను.


"లేదండీ... కొద్దిగా..." తడబడుతూ అన్నా.

"కుమూ వుందిగా టైం గడవటానికి... మీ మామయ్య కూతురేగా..." అతని పొడిమాటలు.

ఊరుకున్నా. నాకంటె పెద్దవాడు. మేనమామకి అల్లుడు. అంటే మా యింటి అల్లుడు క్రిందే లెక్క. గౌరవం యివ్వటం నా ధర్మం.

"కుమూతో మీకు జన్మతః వచ్చిన స్వతంత్రం, అధికారం. నాకు వివాహరీత్యా వచ్చిన అధికారం...

ఒక భర్తగా నా ధర్మాన్ని నేను తప్పా. తనని, పిల్లల్ని వదిలేసి, నా ఆదర్శాల కోసం కొండలు, కోనలు పట్టుకు తిరుగుతున్నా.. నా ఆదర్శాల్ని నేను వదులుకోలేను... బహుశా, మీరిద్దరూ చిన్నప్పుడు వివాహం చేసుకుందామనుకుని, పెద్దవాళ్ళ ఒప్పుకోక, ఒకటవలేకపోయారనుకుంటా. .. మీరు




కుమూని పెళ్లి చేసుకుని, ఆమె జీవితానికి ఒక అర్థాన్ని, నిండుదనాన్ని యివ్వండి. పిల్లల బాధ్యత మీరు తీసుకోనక్కరలేదు."

-అతనలా మాట్లాడుతూ వుంటే, నాకు నోటంట మాట రాలేదు. జీవితంలో ఈ మలుపు నేను వూహించింది కాదు. అంతటి 'సీరియస్ మనిషి'తో నేను ఎప్పుడూ మాట్లాడలేదు.

నా సమాధానం కోసం అతను ఎదురుచూడలేదు.

మరునాడు మా పేటలోని రచ్చబండ దగ్గర సమావేశానికి రమ్మని కబురు వచ్చింది. ఏమిటాని వెళ్లా... ప్రజాకోర్టు.

నన్ను కూర్చోమన్నారు.

అతనూ వున్నాడు.

కుమూ, పిల్లలు వున్నారు.

ఆమె ముఖం చూసే ధైర్యం నాకు లేదు. అనవసరంగా ఆమె జీవితంలో ప్రవేశించి, ఆటలాడుకున్నా నన్పించింది.

కుమూ ముఖం రాత్రల్లా ఏడ్చినట్లుగా వుంది. కళ్ళు ఉబ్బి వున్నాయి. పిల్లలు బిక్కమొగం వేసుకుని, తల్లి చాటున నిలబడి వున్నారు.

నాకంతా అయోమయంగా వుంది. ఏదో జరగకూడనిది జరగబోతోందనిపిస్తోంది.

శేఖర్ మాట్లాడతున్నాడు,

"కామ్రేడ్స్..."

తన నిర్ణయం చెబుతున్నాడు, "నా భార్యని ఆమె మేనత్త కొడుకు రవితో వివాహం జరిపించటానికి అన్నల అనుమతి కోరుతున్నా. నాకు, నా భార్యకి పుట్టిన పిల్లల బాధ్యత నేనే తీసుకుంటున్నా..."

ఒక్కమారుగా ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

నాకు ఒక్కసారిగా భూమి అంతా గిర్రున తిరిగినట్లనిపించింది.

అంతా శూన్యం.

ఏం జరగబోతోంది!

ఇరవయ్యొకటో శతాబ్దంలోకి అడుగుపెడ్తున్నామో, రాతియుగంలోకి వెళ్లిపోతున్నామో అర్థం కాలా.

ఎంతో నిబ్బరంగా అతను తన భార్యని నాకప్పగిస్తున్నాడు.

ఈ నిజాన్ని భరించలేకపోతున్నా.

నా పిరికితనానికి నా జీవితాన్ని పాడు చేసుకోవచ్చు. ఆమె జీవితాన్ని పాడుచేసే అధికారం, హక్కు నాకు లేదు.

అమ్మ, మామయ్య!

హాయిగా సంసారం చేసుకుంటున్న కూతురు కాపురంలో చిచ్చు రగిల్చాడని మామయ్య విలపిస్తుంటే, ఏం చెప్పను!

మేనకోడలి జీవితంతో ఆడుకున్నందుకు అమ్మ నన్ను క్షమిస్తుందా!

అతను విశాలహృదయుడవవచ్చు.

నేను అంతటి ఉన్నత భావాలు కలవాడినా?

ఈ ఘోరాన్ని ఆపాలి.

నా పిరికితనం వాళ్ల జీవితానికి ఉరిత్రాడు కాకూడదు.

జీవితంలో చివరకు ధైర్యం చేశా.. బహుశా, నేను జీవితంలో చేసిన మొదటి, చివరి మంచి పనేమో!

"సోదర, సోదరీమణులకు. కుముదిని నా మేనమామ కూతురు. ఉద్యోగరీత్యా ఈ ఊళ్లో వున్న నేను, మామయ్య కూతురుగదాని చనువుగా వాళ్లింటికి వెళ్లా. మీ అందరికీ తెలుసు, ఉమ్మడి కుటుంబాల్లోని ఆప్యాయతలు. పెద్దల ఆశీర్వాదంతో కుముదినికి, శేఖర్‌కి వివాహం జరిగింది,

వాళ్ల కిద్దరు పిల్లలు కూడా. చిన్నప్పటి నుంచి ఒకచోట పుట్టి, ఒకచోట పెరిగి, ఒకేచోట చదువుకున్న మేము కొద్దిగా అతిచనువుగా వుండటం వల్ల మమ్మల్ని అపార్థం చేసుకుని వుండవచ్చు. కుముదిని నా మేనమామ కూతురైనా, నాకు చెల్లెలు లాంటిది. నావల్ల ఆమె జీవితం పాడవకూడదు. నోరులేని ఆ పిల్లల భవిష్యత్తు పాడవకూడదు. హాయిగా సాగుతున్న వాళ్ల సంసారంలో చిచ్చుపెట్టే హక్కు నాకు లేదు. ఒక భార్య నుంచి భర్తని, పిల్లల నుంచి తల్లిని విడదీసే రాక్షసుడ్ని కాను నేను. నావల్ల కుముదిని, శేఖర్‌ల జీవితంలో కల్లోలం ఎందుకు రావాలి, అందుకే వారి జీవితాల్లో నుంచి నేను నిష్క్రమిస్తున్నాను..."

ప్రజల తీర్పు కోసం నేను ఆగలేదు. అక్కడి నుంచి వచ్చేశా.

**అతడు, ఆమె:** వాళ్లిద్దరూ జీవితంలో తమ తప్పులని సరిదిద్దుకున్నారు. అతను హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగంలో చేరాడు. ఆమె చేసిన పూజలు ఫలించాయి.

**నేను:** అక్కడి నుంచి అహ్మదాబాదుకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని, వాళ్ల జీవితాల నుంచి దూరంగా వెళ్లిపోయా. ఇంకోసారి యింకోళ్ల జీవితంతో ఆడుకోకూడదని, పెళ్లి చేసుకున్నా. ●


కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్